teluguislam.net



# దైవప్రవక్త (స) జీవితం ఆదర్శప్రాయం

## 215వ అంశం దైవప్రవక్త (స) - ఆయన సతీమణుల మధ్య గల ప్రేమానురాగాలకు సంబంధించిన ఒక సంఘటన.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "దైవప్రవక్త (స) ప్రయాణానికి సిద్ధమైనప్పుడు భార్యల సమక్షంలో చీటీలు వేసేవారు. ఒకసారి అలాగే చీటీలు వేస్తే ఆయిషా, హఫ్సాల పేర్లు వచ్చాయి (అందువల్ల వారిద్దరూ ప్రవక్త వెంట బయలుదేరారు). ప్రయాణ సందర్భంగా దైవప్రవక్త (స) రాత్రిపూట తన ధర్మపత్నితో మాట్లాడుతూ కాలక్షేపం చేసేవారు. (ఈ ప్రయాణ సందర్భంగానే) హజ్రత్ హఫ్సా హజ్రత్ ఆయిషాతో, 'ఇవాళ రాత్రి నువ్వు నా ఒంటెపై కూర్చో. నేను నీ ఒంటెపై కూర్చుంటాను. చూద్దాం (ఏం జరుగుతుందో)' అన్నారు నవ్వులాటకు. అనుకున్న దాని ప్రకారమే వారు ఒంటెలు మార్చుకున్నారు. దైవప్రవక్త (స) తన అలవాటు ప్రకారం హజ్రత్ ఆయిషా ఒంటె వద్దకు వచ్చారు. కాని ఆ ఒంటె మీద హజ్రత్ హఫ్సా ఉన్నారు. ఆయన (స) సలాం చేశారు గాని ఒంటెపై వేరొకరున్న విషయం పసిగట్టలేక పోయారు. (కబుర్లు చెప్పారు) చివరకు మజిలీకి చేరుకున్నారు. ఆ రోజు రాత్రి దైవప్రవక్త (స) సహచర్యానికి నోచుకోలేకపోయినందుకు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆవేదన చెందారు. మజిలీకి చేరుకున్న తరువాత ఆమె తన రెండు కాళ్లను అజ్ఖర్ గడ్డిలో పెట్టి 'ఓ అల్లాహ్! నన్ను కాటేయటానికి ఏ పామునో, తేలునో పంపించు. ఆయనగారినైతే నేను దోషిగా నిల బెట్టలేను (అసలు ఈ దీనంతటికీ నేనే బాధ్యురాలిని) అన్నారు." ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[1]

## 216వ అంశం అలుమగల అనురాగాలు.

హజ్రత్ ఆయిషా (ర.అ) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) నాతో "ఆయిషా! నువ్వు నాపట్ల ఎప్పుడు సంతోషంగా ఉంటావో, ఎప్పుడు కినుక వహిస్తావో కూడా నాకు తెలిసిపోతుంది" అన్నారు. 'అదెట్లా?' అని ఆయిషా (రఅ) అడిగితే, దైవప్రవక్త (స) ఇలా వివరించారు: "నీవు నా యెడల సంతోషంగా ఉన్నప్పుడు సంభాషణ మధ్యలో 'ముహమ్మద్ (స) ప్రభువు సాక్షిగా!' అని అంటుంటావ్. నా మీద కినుక వహించినప్పుడు, 'ఇబ్రాహీమ్(అ) ప్రభువు సాక్షిగా!' అని అంటుంటావ్. అవునా?" 'అవును, ఓ దైవప్రవక్తా (స)! కోపం వున్నప్పుడు తప్ప మరెప్పుడూ మీ పేరు వదలటానికి ఇష్టపడను' అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఒప్పేసుకున్నారు. - ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[2]

1. ముఖ్తసర్ సహీహ్ బుఖారీ లిల్ జుబైదీ -హ.నెం.1862
2. ముఖ్తసర్ సహీహ్ బుఖారీ లిల్ జుబైదీ - హ.నెం.1368

## 217వ అంశం ప్రేమను వ్యక్తపరిచే ఓ అరుదైన పద్ధతి.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (స) 'బఖీ' అనే ఖనన వాటిక నుంచి (ఒకరి అంత్యక్రియలలో పాల్గొని) తిరిగి వచ్చారు. ఆ సమయంలో నేను తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ ఉన్నాను. "అయ్యో! నా తల పగిలిపోతోంది" అన్నాను. దానిపై ఆయన(స) "పగిలేది నీ తల కాదు, నా తల" అన్నారు. ఆ తరువాత ఆయన (స) ఇలా చెప్పారు: "ఆయిషా! నువ్వు నా కన్నా ముందే పోతే నీ అంతిమ సంస్కారాలన్నీ నా చేతుల మీదుగా కానిస్తాను. నేను స్వయంగా నీకు స్నానం చేయించి, కఫన్ తొడిగిస్తాను. నీ జనాజా నమాజ్ చేయిస్తాను. నా స్వహస్తాలతో నిన్ను ఖననం చేస్తాను." (ఇబ్నుమాజా-1465 హసన్)[1]

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అంటున్నారు: "నేను అశుద్ధావస్థలో ఉన్నప్పుడు కూడా నీరు త్రాగిన చెంబును దైవప్రవక్త (స) కు ఇచ్చేదానిని. ఆయన (స) అదే చెంబులో, నా పెదవులు తగిలిన చోటే పెదాలు తగిలించి నీరు సేవించేవారు. బొయికతో కూడిన మాంసం తిని ఆయనకిచ్చేదానిని. సరిగ్గా నేను కొరికిన చోటునుంచే ఆయన(స)మాంసం కొరికి తినేవారు." ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[2]

## 218వ అంశం ప్రవక్త (స) కుటీరాలలోనూ తప్పని సవతి పోరు.

హజ్రత్ అనస్ (రజి) కథనం: మహనీయ ముహమ్మద్ (స) తన (వంతు ప్రకారం) సతీమణులలో ఒకామె వద్ద ఉన్నారు. అంతలోనే వేరొక సతీమణి ఒక పాత్రలో భోజనం పంపించారు. కాని ఇంటావిడ (కోపంతో) సేవకురాలి చేతిని విదిలించేసరికి ఆ పాత్ర క్రిందపడి ముక్కలైపోయింది. దైవప్రవక్త (స) నిగ్రహంతో ఆ పాత్ర ముక్కల్ని ఏరి ఒకచోట పెట్టారు. పడిపోయిన అన్నాన్ని ప్రోగుచేశారు. (ఇంట్లో ఉన్న వారిని ఉద్దేశ్యించి) "ఇవాళ మీ అమ్మగారికి (సవతిపై) కోపం వచ్చినట్టుంది!" అన్నారు. దరిమిలా ఆయన(స) సేవకురాలిని ఆపి, ఆ ఇంట్లోని కొత్త పాత్రను తీసుకుని సేవకురాలికిచ్చారు. పగిలిపోయిన పాత్రను అక్కడే ఉండనిచ్చారు. ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[3]

వివరణ: ఆ రోజు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వంతు. అందుచేత దైవప్రవక్త (స) ఆ సమయంలో ఆమె ఇంటనే ఉన్నారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వంటచేస్తూ ఉండగా హజ్రత్ జైనబ్ (ర.అ) గారో లేదా హజ్రత్ హఫ్సా (రఅ) గారో భోజనం పంపారు. అమ్మ ఆయిషా (రఅ)గారికి కోపం వచ్చింది.

---

1. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్బానీ - మొదటి భాగం, హ.నెం.1198
2. కితాబుల్ హైజ్ - బాబు జవాజు గస్లిల్ హైజి రసు జౌజిహ్
3. కితాబున్నికాహ్ - బాబు ఘీరతి

teluguislam.net


హజ్రత్ అనస్ (రజి)కథనం: (ఉమ్ముల్ మోమినీన్) హఫ్స (రఅ) తనను యూదపుత్రిక అన్నారని విశ్వాసుల మాత హజ్రత్ సఫియా (రఅ)కు తెలిసింది. ఈ మాట విని హజ్రత్ సఫియా (రఅ) ఏడ్వసాగారు. దైవప్రవక్త (స) ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆమె ఏడుస్తూనే ఉన్నారు. "సఫియా! ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగారాయన(స). "నేను యూద పుత్రికనని హఫ్సా ఎద్దేవా చేస్తోంది" అని ఆమె చెప్పారు. "అరె! నీవు ప్రవక్త (హజ్రత్ మూసా- అలైహి) పుత్రికవు. నీ బాబాయి (హజ్రత్ హారూన్-అలైహి) కూడా ప్రవక్తే. నీ భర్త (ముహమ్మద్-సఅసం) సయితం ప్రవక్తేనాయె. అలాంటప్పుడు దేని ఆధారంగా ఆమె(హఫ్సా) నీపై ఆధిక్యతను చాటగలుగు తుంది?" అని సఫియా (రఅ)ను సముదాయించారు. ఆ తరువాత ఆయన (స), "హఫ్సా! అల్లాహ్‌కు భయపడు (ఇక మీదట ఎన్నడూ నీ నోట ఇలాంటి మాట వెలువడ కూడదు)" అని మందలించారు. (తిర్మిజీ-3894 సహీహ్)[1]

**వివరణ:** హజ్రత్ హఫ్సా (రఅ) హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కుమార్తె. కాగా హజ్రత్ సఫియా (రఅ) యూద నాయకుడైన హుయి బిన్ అఖ్తబ్ కూతురు.

## 219వ అంశం సతీమణుల సున్నిత స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని....

హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (స) ప్రయాణ సందర్భంగా తన సతీమణుల వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఒంటెలను తోలే అంజిషా అనే వ్యక్తి ఒంటెలను వేగంగా పోనిస్తున్నాడు. ఇది గమనించిన దైవప్రవక్త (స), "అంజిషా! నీ పాడుగాను! ఒంటెలను నిదానంగా పోనివ్వు. వీటిపై స్వారీ అయివున్న మహిళలను నీళ్లు నింపబడి ఉన్న కుండలుగా భావించు" అని చెప్పారు. ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[2]

1. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్బానీ - మూడవ భాగం, హ.నెం.3055
2. కితాబుల్ ఫజాయెల్ - బాబు రహ్మతు సల్లల్లాహు అలైహి వసల్లం